‘వందనం’ కోసం ప్రదక్షిణలు

- కొందరికి మాత్రమే తల్లికి వందనం నగదు జమ
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు
- అద్దె ఇంటిని మ్యాపింగ్ చేసి ఆన్‌లైన్‌లో అనర్హులుగా నమోదు



నూజివీడు: తల్లికి వందనం పథకం అమలులో లోపాలతో అర్హులకు సైతం డబ్బులు జమకాలేదు. దీంతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు గత రెండు నెలలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తల్లికి వందనం రాని అర్హులు పోటెత్తుతున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు రూ. 7వేల నుంచి రూ.9వేలు

ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది ఎగ్గొట్టింది. రెండో ఏడాది అమలు చేసి దానిని రూ.13 వేలకు పరిమితం చేశారు. అలాగే చాలా మంది ఎస్సీ విద్యార్థులకైతే రూ.7 వేలు, రూ.9 వేల చొప్పున జమయ్యాయి. దీనిపై వారి తల్లిదండ్రులు అధికారులను అడిగితే కేంద్ర ప్రభుత్వ వాటా రావాల్సి ఉందని, అవి రాగానే జమ చేస్తారని సమాధానమిస్తున్నారు. తల్లికి వందనంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఏమిటో అర్థం కాక ఏమీ చేయలేక వారు వెనుదిరిగి వెళుతున్నారు. ఇలా తక్కువ ఎందుకు వచ్చాయనే విషయం లబ్ధిదారులకు చెప్పే వారే కరువయ్యారు.

అర్హులకు కాకుండా వేరే అకౌంట్లలో జమ

మరి కొందరు అర్హులకు సంబంధించి వారి పిల్లలకు సంబంధించిన తల్లికి వందనం డబ్బులు వేరే వారి అకౌంట్లలో జమ అయ్యాయి. ఆ డబ్బులను జమ అయిన ఖాతాదారుడు లబ్ధిదారులకు ఇవ్వడం లేదు. అంతే కాకుండా ఇద్దరు పిల్లల్లో ఒక పిల్లవాడికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్య పథకంలో సీటు వచ్చిందని చెబుతూ రెండో పిల్లాడికి సైతం తల్లికి వందనం నిధులు జమ చేయకుండా ప్రభుత్వం ఎగ్గొట్టింది. దీంతో ఇలాంటి వారు సైతం సచివాలయానికి.. అక్కడి నుంచి ఎంఈఓ కార్యాలయానికి.. ఆ తరువాత సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లి అర్జీలను అందజేస్తూనే ఉన్నారు తప్పితే వారి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.

అద్దె ఇంట్లో ఉంటున్నా.. విద్యుత్ సర్వీసు లేకపోయినా..

కొందరు మధ్య తరగతి ప్రజలు నూజివీడు పట్టణంలో అద్దెకు నివాసముండగా ఆ ఇల్లు మొత్తాన్ని అద్దెకుండే వారి పేరు మీద సచివాలయ సిబ్బంది మ్యాపింగ్ చేయడంతో వారికి వేయి చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు ఉన్నందున తల్లికి వందనానికి అనర్హులని, విద్యుత్ సర్వీసు లేకపోయినా ఒక నెలలో 300 యూనిట్ల కంటే ఎక్కువ యూనిట్లు వాడినందున తల్లికి వందనానికి అనర్హులని ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. దీంతో ఇలాంటి వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో నూజివీడు మండలంలో అమ్మఒడి పథకంలో 12 వేల మందికి ఇవ్వగా, కూటమి ప్రభుత్వంలో 9,468 మందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేసింది.

ముగ్గురు పిల్లల్లో ఒక్కరికీ తల్లికి వందనం రాలేదు



నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమారులు హైస్కూల్‌లోనూ, కుమార్తె ప్రైవేటు స్కూల్‌లోనూ చదువుతోంది. మాకు విద్యుత్ సర్వీసు లేకపోయినా 300 కంటే ఎక్కువ యూనిట్లు వాడినట్లు చూపిస్తుండటంతో అనర్హులుగా పేర్కొంటూ ఆపేశారు. దీనిపై విద్యుత్ శాఖాధికారుల వద్ద వెళ్లి లెటర్ తెచ్చి ఆన్‌లైన్‌లో పెట్టినా ఇంతవరకు తల్లికి వందనం డబ్బులు పడలేదు.

–బత్తుల దుర్గ, నూజివీడు

వేరేవారి బ్యాంకు ఖాతాలో జమయ్యాయి



మా పాపకు రావలసిన తల్లివందనం డబ్బులు వేరొకరి బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఈ విషయం గ్రామ సచివాలయానికి వెళ్లి అడిగితే తెలిసింది. దీంతో మా డబ్బులు ఇవ్వమని అడిగితే వారు ఇవ్వడం లేదు. వేరే వారి అకౌంట్‌లో జమ అయిన డబ్బులను మాకు ఇప్పించి న్యాయం చేయాలి.

– మొలుగుమాటి కిరణ్‌బాబు, తుమ్మగూడెం, చాట్రాయి మండలం

విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించం

మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరిక



నూజివీడు: ఏరియా ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యంగా రాత్రి పూట డ్యూటీలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదని, సిబ్బంది ఎవరూ ప్రజలకు సరైన సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆస్పత్రి సిబ్బంది తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

14న పవర్ లిఫ్టింగ్ పోటీలు

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న తిరువూరులో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. స్థానిక బైపాస్‌రోడ్డు సెంటర్‌లోని వీ కన్వెన్షన్ హాల్‌లో నాగుబండి రామారావు స్మారక సంస్థ సహకారంతో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా ఓపెన్, మాస్టర్స్ బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 99854 22567 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

చెత్త తొలగింపు పనుల పరిశీలన



మునునూరు: గ్రామాల్లో చెత్త తొలగింపు కార్యక్రమాలను నిరంతరం బాధ్యతగా చేయించాలని జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి పేర్కొన్నారు. రమణక్కపేటలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసి, పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. గ్రామాల్లో పరిశుభ్రత కోసం చేపట్టే చెత్త శుద్ధి, తొలగింపు కార్యక్రమాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా సిబ్బంది సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ బీవీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



తిరువూరు: స్థానిక శ్రీనిధి స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పలు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ వెంకట నారాయణ తెలిపారు. హైదరాబాద్, దాచేపల్లిలో జరిగిన ఈ పోటీల్లో కుమటీ విభాగం అండర్ 13లో తమ పాఠశాల విద్యార్థులు రోహన్ పునీత్, అండర్ 10లో ఎం. నాగ నిఖిల్‌సాయి, కటా విభాగంలో జె. నాగ చైత్రేష్‌లు ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. విద్యార్థులను, కరాటే కోచ్ రేవంత్‌ను పాఠశాల కరస్పాండెంట్ ముత్యాల కిశోర్, ఉపాధ్యాయులు అభినందించారు.

చేతి పంపును తొలగించాలి



చాట్రాయి: రోడ్డు పక్కన ఉన్న చేతి పంపు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. మండలంలోని కృష్ణారావుపాలెం మెయిన్ రోడ్డు పక్కనే నిరుపయోగంగా ఉన్న చేతి పంపు ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో ఉంది. ఈ రోడ్డు నుంచి భారీ వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు ఈ ప్రదేశంలో తప్పుకునే సమయంలో చేతి పంపు ప్రమాదకరంగా మారుతుందని, రోడ్డు పక్కన ఉన్న చేతి పంపును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



చాట్రాయి: నీటిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. మండలంలోని నరసింహారావుపాలెం సెంటర్ పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నీరు నిలిచింది. మరమ్మతులు చేపట్టాలంటే నీటిలో దిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



ఆగిరిపల్లి: బాలికలు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో విద్యార్థులకు సోషల్ మీడియా, సైబర్ క్రైమ్, చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాను విద్యార్థులు అవసరం మేరకే వినియోగించుకోవాలని సూచించారు. ఆపద సమయంలో 112కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శుభశేఖర్, ఫాదర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహనరావుకు నివాళి



చాట్రాయి: మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చల్లగుళ్ల జగన్‌మోహనరావు (రాజా) మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు అని మండల పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కొత్తగూడెంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ జగన్‌మోహనరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని వర్తింపజేయాలి

నూజివీడు: కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం అర్హత ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని వర్తింప చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 2003 ఉపాధ్యాయ ఫోరమ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాలనాపరమైన విధానాల కారణంగా పోస్టింగ్ ఆలస్యమైన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ బొల్లిగర్ల శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు జి.వెంకటేశ్వరరావు, బాబూ రాజేంద్రప్రసాద్, మల్లవరపు శ్రీనివాసరావు, బుడిపుడి వెంకటేశ్వరరావు, జి.రాజు పాల్గొన్నారు.



ఏఓ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఉపాధ్యాయుల ధర్నా

తిరువూరు: కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఉద్యమ కార్యాచరణలో భాగంగా 2003 డీఎస్సీలో నియమితులైన ఉపాధ్యాయులు తిరువూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో ప్రకారం ఓపీఎస్ విధానం కిందకు తేవాలని కోరుతూ తహసీల్దారు ఉదయభాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో పాత పెన్షను విధానాన్ని పునరుద్ధరించగా, ఏపీలో మాత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోని ప్రభుత్వం ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షిస్తోందని పలువురు పేర్కొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయతీ

తిరువూరు: బస్సులో ఒక ప్రయాణికురాలి బంగారు గొలుసు జారిపడిపోగా దానిని తిరిగి ఆమెకు అందజేసిన తిరువూరు ఆర్టీసీ డిపో కండక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు అధికారుల ప్రశంసలందుకున్నారు. తిరువూరు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సులో గురువారం తిరువూరులో ఎక్కిన పుష్పాల అంజమ్మ అనే ప్రయాణికురాలు మైలవరం బస్టాండ్‌లో దిగిపోయింది. ఆమె మెడలోని బంగారు గొలుసు సీటు కింద జారిపడిపోయింది. బస్సు వెళ్లిపోయిన తదుపరి అంజమ్మ తన మెడలో గొలుసు కనిపించకపోవడంతో మైలవరం బస్‌స్టేషన్ కంట్రోలర్‌కు ఫిర్యాదు చేసింది. కంట్రోలర్ సూచన మేరకు కండక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు అంజమ్మ కూర్చున్న సీటు కింద కనిపించిన గొలుసును భద్రపరచి తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యంకు అందజేశారు. సుమారు రూ.3 లక్షల విలువైన బంగారు గొలుసును ప్రయాణికురాలికి అందించిన కండక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు, డ్రైవరు సత్యనారాయణలను డీఎం, సిబ్బంది అభినందించారు.



ప్రయాణికురాలికి బంగారు గొలుసు అప్పగిస్తున్న డీఎం సుబ్రహ్మణ్యం, కండక్టర్ వెంకటేశ్వరరావు

కాలుష్యం నివారణకు చర్యలు చేపట్టండి

సీఈకి కొండపల్లి మున్సిపల్ చైర్మన్ వినతి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ వెదజల్లుతున్న కాలుష్యం నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆ సంస్థ చీఫ్ ఇంజినీర్ శివ రామాంజనేయులుని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు కోరారు. ఎన్టీటీపీఎస్ పరిపాలనా భవనంలో సీఈని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో మొక్కలు నాటి వాటి రక్షణ బాధ్యత చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీ బకాయిలను చెల్లించాలని కోరారు. ప్లాంట్ వలన మున్సిపాలిటీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కొండపల్లి కమిషనర్ మౌస్మీ గనియా పాల్గొన్నారు.



ఎన్టీటీపీఎస్ సీఈకి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 13 ప్రకారం 2,260 పోస్టులకు సిలబస్ ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేసింది. గురువారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ధర్నా జరిగింది. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఈ ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 86 వేల మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేసి వారి శక్తి, సామర్థ్యాలను సమాజం కోసం వినియోగించుకోవాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జూలై 15, 2025 లోపు స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు. 20 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ, డీఈడీ చేసిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర నాయకులు బసవ, కృష్ణ అభ్యర్థులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ అభ్యర్థులు, డీవైఎఫ్ఐ కార్యకర్తలు

యూరియా సరఫరా చేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ నాయకుల విమర్శ
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

నూజివీడు: నియోజకవర్గ అభివృద్ధి చెందిందంటే అది కేవలం మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వల్లే జరిగిందని, ఈ విషయం నియోజకవర్గ ప్రజలందరికి తెలుసునని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు తమ స్థాయికి మించి మాట్లాడటం తగదన్నారు. యూరియాను సరఫరా చేయలేని ప్రభుత్వం రాష్ట్రంలో పాలిస్తోందన్న విషయం రైతుల క్యూలే నిరూపిస్తున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం పండగలా ఉంటే కూటమి ప్రభుత్వంలో వ్యవసాయం దండగగా మారిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదనే విషయం రైతులు రోడ్డెక్కడాన్ని బట్టే తెలుస్తోందన్నారు. పొగాకు, మిర్చి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టాల పాలవుతున్నారని చెప్పారు. పార్టీలు మారడం అనేది ఎవరిష్టం వారిదని, అయితే స్వప్రయోజనాల కోసమా, అభివృద్ధి కోసమా అనేది ప్రజలు నిర్ణయిస్తారన్నారు. తల్లికి వందనం రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.13 వేలు వేశారని, ఎస్సీ వర్గాల విద్యార్థులకు అయితే రూ.7 వేలు, 8 వేలు మాత్రమే విడుదల చేశారన్నారు. 17 మెడికల్ కాలేజీలను రాష్ట్రానికి తీసుకువస్తే వాటిలో పది కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ నాయకులు అవాకులు, చెవాకులు మాట్లాడకుండా వాస్తవాలను గమనించాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మున్సిపల్ వింగ్ అధ్యక్షులు మలిశెట్టి బాబీ, కౌన్సిలర్లు నవుడు నాగమల్లేశ్వరరావు, మీర్ అంజాద్ ఆలీ, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు పిళ్లాచరణ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దసరా ఉత్సవ ఏర్పాట్లకు టెండర్ల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని కోట మహిషాసురమర్ధని అమ్మవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అలివేణి గురువారం విలేకరులకు తెలిపారు. దీనిలో భాగంగా మైక్‌సెట్‌లు, షామియానా సామగ్రి, ప్రసాదాల తయారీ, భోజనాల సరఫరా, అమ్మవారి పూల అలంకరణలకు సంబంధించి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వచ్చిన సీల్డ్ టెండర్లను ఈ నెల 15న ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో తెరుస్తామన్నారు. ఆసక్తిగల వారు టెండర్లు దాఖలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

వెదుళ్లవాగుకు వరద ఉధృతి



తిరువూరురూరల్: మండలంలోని చౌటపల్లి–జీకొత్తూరు గ్రామాల నడుమ వెదుళ్లవాగుకు గురువారం మళ్లీ వరద రావడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షంతో వాగు చప్టాపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. తిరువూరు మండలంలో 7.86 సెంటీ మీటర్లు, గంపలగూడెం మండలంలో 10.94 సెంటీమీటర్లు, విస్సన్నపేట మండలంలో 9.12 సెం.మీ., ఎ.కొండూరులో 2.14 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

విస్సన్నపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలో జరిగిన పనులపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు గురువారం తెలిపారు. 18వ విడత సామాజిక తనిఖీ జరిగిందని, దీనిలో గుర్తించిన అంశాలపై సంబంధిత అధికారుల సమక్షంలో ప్రజావేదిక నిర్వహిస్తామని చెప్పారు.

యూటీఎఫ్ రణభేరిని విజయవంతం చేయాలి



మునునూరు: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న నిర్వహించే రణభేరి, బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మకిశోర్, జి.రాంబాబు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ నేతల ఆధ్వర్యంలో గురువారం చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు రణభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడిచినా ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలు విడుదల చేయకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అల్లాబక్షు, నాగబాబు, సహాధ్యక్షులు పుల్లయ్య, కోశాధికారి నక్కా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ఇబ్రహీంపట్నం: ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన దివ్యాంగుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కనిపించడం లేదని, తమ బిడ్డను వెంటనే తమకు అప్పగించాలని విద్యార్థి తల్లిదండ్రులు గురువారం పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. సేకరించిన వివరాల ప్రకారం.. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన జోజిబాబు, జ్యోత్స్న దంపతుల కుమారుడు సన్నీని పదో తరగతి నిమిత్తం దివ్యాంగుల పాఠశాలలో చేర్పించారు. తన కుమారుడిని చూసేందుకు వచ్చిన తల్లికి కుమారుడు లేడనే విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల జోక్యంతో పాఠశాల యజమాని కూడా మా హాస్టల్ విద్యార్థి కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. కుమారుడి తల్లిదండ్రులు స్థానికులతో కలిసి దివ్యాంగుల హాస్టల్ వద్ద ఆందోళన చేసి తమ బిడ్డను హాస్టల్ నిర్వాహకులే ఏదో చేశారని ఆరోపించారు. తమ బిడ్డను తక్షణం తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఇబ్రహీంపట్నంలో దివ్యాంగుల హాస్టల్ వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు


పోలీసుల అదుపులో హాస్టల్ నిర్వాహకురాలు

విద్యార్థుల తల్లిదండ్రులు జోజిబాబు, జ్యోత్స్న ఇచ్చిన ఫిర్యాదుతో హాస్టల్ నిర్వాకురాలు వసంత కుమారిని గురువారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హాస్టల్ నిర్వహణకు అనుమతులు కూడా లేవని వారు చెబుతున్నారు. బాధితులకు న్యాయం చేయాలని, అలా జరగని పక్షంలో పోలీస్‌స్టేషన్ ముట్టడిస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్చరించారు.

బూడిద లోడింగ్‌కు అవకాశం ఇవ్వకుంటే అడ్డుకుంటాం

బూడిద లారీ ఓనర్లు, ప్రజాప్రతినిధుల హెచ్చరిక

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ చెరువులో బూడిద లోడింగ్‌ను స్థానికులకు ఇవ్వకుంటే అడ్డుకుంటామని వార్డు కౌన్సిలర్ రావి ఫణి, లారీ ఓనర్లు ఏపీ జెన్‌కో అధికారులను హెచ్చరించారు. పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యంగా బూడిద కాలుష్యంతో పశ్చిమ ఇబ్రహీంపట్నం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలుష్యంతో ప్రజలకు వ్యాధులు సంక్రమిస్తుంటే లాభాలు ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తారా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నో కుటుంబాలు బూడిద రవాణాపై ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పారు. ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తే తాము ఎలా జీవించాలని ప్రశ్నించారు. పలువురు లారీ ఓనర్లు, వర్కర్లు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న లారీ ఓనర్లు, వార్డు కౌన్సిలర్లు

వేధింపుల భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గొల్లపూడి శ్రీనివాస కాలనీకి చెందిన నూర్ రబ్బానీ, మహమ్మద్ ముస్తాఫాలకు 12 ఏళ్ల కిందట వివాహమైంది. రబ్బానీ భర్త ముస్తాఫా కొత్తూరు తాడేపల్లిలోని ప్లైవుడ్ కంపెనీలో పనిచేస్తుంటాడు. మద్యం, చెడు వ్యసనాలు అలవాటయ్యాయి. ప్రతి రోజు మద్యం సేవించి వచ్చి భార్యను వేధిస్తున్నాడు. వేరే స్త్రీతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో రబ్బానీ భర్తను నిలదీసింది. దీనితో ఆమెను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. దీనిపై బాధితురాలు భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.